నానక్‌రాంగూడలో ఫ్యూచర్‌సిటీ కార్యాలయం

త్వరలోనే ప్రారంభించాలని ప్రభుత్వ నిర్ణయం

రంగారెడ్డి, మార్చి 27 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డిజిల్లాలో రూపుదిద్దుకోనున్న ఫ్యూచర్‌సిటి ప్రధాన కార్యాలయాన్ని నానక్‌రాంగూడలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా పరిధిలోని గచ్చిబౌలి సమీపంలోగల నానక్‌రాంగూడలో ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటుచేసి అక్కడినుంచి ఫ్యూచర్‌సిటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే, హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయం కూడా నానక్‌రాంగూడలోనే ఉండటం వలన ఈ కార్యాలయాన్ని కూడా అక్కడే ఏర్పాటుచేస్తే బాగుంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉండే ఫ్యూచర్‌సిటి డెవలప్‌మెంట్ అథారిటీ సీఎంఓకు సమీపంలో ఉండాలన్న నిర్ణయం మేరకే ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలోనే నానక్‌రాంగూడ ఉండటం వలన అక్కడినుంచి ఓఆర్‌ఆర్ మీదుగా ఫ్యూచర్‌సిటీకి చేరుకోవటానికి సులభంగా ఉంటుందని ఆ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలిసింది. నానక్‌రాంగూడలో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుచేసి ఫ్యూచర్‌సిటి పూర్తిస్థాయి నిర్మాణం జరిగిన తర్వాత కార్యాలయాన్ని ఫ్యూచర్‌సిటికి మార్చే అవకాశాలున్నాయి.

అధికారులను నియమించే పనిలో ప్రభుత్వం..

ఫ్యూచర్‌సిటీకోసం ఇప్పటికే ప్రభుత్వం 36పోస్టులను కేటాయించింది. 36పోస్టుల్లో ఒక ఐఏఎస్ అధికారితో పాటు మరికొంతమంది గ్రూప్-1 అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లతో పాటు సర్వే డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అధికారులు కూడా ఉండనున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టుల్లో అధికారులను భర్తీ చేయటం కోసం జిల్లాలోని సీనియారిటీ ప్రతిపాదికన అధికారులను నియమించనున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఫ్యూచర్‌సిటి పరిధిలోకి వచ్చే ఏడు మండలాల్లో ఉన్న అధికారులతో పాటు జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులను ఈ పోస్టుల్లో భర్తీచేసే అవకాశాలున్నాయి.

విద్యార్థులు ఇంగ్లిష్‌లో ధారాళంగా మాట్లాడగలగాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 27 : ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆంగ్ల బోధన చేసి పిల్లలు ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడటం హర్షించదగిన విషయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారము కలెక్టరేట్ సమావేశము హాలు నందు జరిగిన యంగ్ ఓరేటర్స్ క్లబ్ , బొస్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో విద్యా కదంబం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ఏర్పాటు చేసిన వైఓసి యంగ్ ఓరేటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా లో ఉన్నటువంటి ప్రాథమిక , ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ బోధించడం జరిగిందన్నారు. ఇంగ్లీష్ కు సంబంధించి విద్యార్థులు దారాళంగా ఇంగ్లీషు మాట్లాడడానికి ఉపాధ్యాయులు వివిధ రకాల కృత్యాలు యాక్టివిటీస్ ద్వారా ఇంగ్లీష్ నేర్పించడం జరిగిందని తెలిపారు. ఇంగ్లీష్ మాట్లాడడానికి ఉపాధ్యాయులు బోధన జరిపించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు మాతృభాషతో పాటు ఇంగ్లీష్ భాషను కూడా కచ్చితంగా నేర్చుకుని ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నాటికను తిలకించి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకా దేవి , వైఓసీ సభ్యులు, డీఆర్పీలు విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి తొలగింపు ప్రక్రియను పరిశీలించిన హైడ్రా కమిషనర్



మాసబ్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

తుర్కయంజాల్,మార్చి 27:తుర్కయంజాల్ మున్సిపాలిటి మాసబ్ చెరువు బఫర్ జోన్ పరిధిలో డంప్ చేసిన మట్టి తొలగింపు ప్రక్రియను గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు.ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ చెరువు బఫర్ జోన్ పరిధిలో డంప్ చేసిన మట్టిని పూర్తిగా తొలగించి చెరువును కాపాడుతామని తెలిపారు. మట్టిని డంప్ చేసిన వరిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి,హైడ్రా అధికారులు,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేరాల అదుపుపై దృష్టి సారించాలి

-సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి
-షాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ

షాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి

షాబాద్, మార్చి 27: నేరాల ఆదుపుపై దృష్టి సారించి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి అన్నారు. గురువారం సాయంత్రం రంగారెడ్డిజిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లోని ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ...డ్రగ్స్, గంజాయి విక్రయాలపై సీరియస్‌గా దృష్టి పెట్టాలని సూచిం చారు. అందరూ సీరియస్‌గా పనిచేయాలని, అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై నిఘా వేసి ఉంచాలని సిబ్బం దిని ఆదేశించారు. కేసుల దర్యాప్తు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండొద్దన్నారు. పోలీస్‌స్టేషన్‌లో నూత నంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చూసి మెచ్చుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు వివరిం చాలన్నారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసులు ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలని, మంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఆయన వెంట రాజేంద్రనగర్ జోన్ డీసీపీ సి.హెచ్ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్, షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేశ్, సిబ్బంది తదితరులున్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారుడు

వికారాబాద్, మార్చి 27 : రాష్ట్ర కబడ్డీ జట్టుకు క్రీడాకారుడు గోపి ఎంపికైనట్లు వికారాబాద్ జిల్లాలో కబడ్డీ అధ్యక్షులు నేనావత పరశురామ్‌నాయక్ తెలిపారు. బీహార్ రాష్ట్రం గయా జిల్లాలో నిర్వహించే 34వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు వికారాబాద్ జిల్లా క్రీడాకారుడు గోపి ఎంపికయడు. ఈ నెల 27 నుంచి 30 వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో మంచి ప్రదర్శన చేసినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వికారాబాద్ జిల్లా కబడ్డీ అధ్యక్షులు నేనావత్ పారశురాం నాయక్ , జిల్లా కార్యదర్శి వినోద్ కుమార్ ముదిరాజ్ తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లకు
సెలవులు రద్దుచేసి.. స్పెషల్‌డ్రైవ్

సిటీబ్యూరో: ఆస్తి పన్ను నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు జీహెచ్‌ఎంసీ అపసోపాలు పడుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2వేల కోట్ల లక్ష్యాన్ని టార్గెట్‌గా పెట్టుకోగా.. గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనున్నది. ఇందులో భాగంగానే 19.25 లక్షల మందిలో 13.60 లక్షల మంది మాత్రమే ఆస్తిపన్ను చెల్లించగా, వీరి నుంచి రూ. 1720 కోట్ల మేర ఆదాయాన్ని రాబట్టుకున్నది. ఆస్తిపన్ను చెల్లించకుండా ఉన్న దాదాపు 5 .75లక్షల మందిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి రూ.280 కోట్ల రాబట్టాలని భావిస్తున్నారు. ఈ మేరకు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, డీసీలను సెలవులు రద్దు చేసిన కమిషనర్.. వసూళ్లు పెంచడమే రోజూవారీ సమీక్షలు పెట్టి టార్గెట్లు ఇస్తున్నారు. ఇతర పనులకు ఫుల్‌స్టాప్ పెట్టిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఒక్క ఆస్తిపన్ను కలెక్షన్లపైనే ప్రధాన ఫోకస్‌గా పనిచేస్తున్నారు.జీహెచ్‌ఎంసీ కల్పించిన వన్ టైం సెటిల్‌మెంట్ పథకానికి సద్వినియోగం చేసుకోవాలని, వడ్డీపై 90శాతం పన్ను రాయితీ పొందాలని కమిషనర్ ఇలంబర్తి సూచించారు. ఆస్తిపన్నును ఆన్‌లైన్, సిటీజన్ సర్వీస్ సెంటర్లు, ఈ -సేవా కేంద్రాల ద్వారా చెల్లించవచ్చని, సర్కిల్, హెడ్ ఆఫీస్‌లో ఉన్న సిటిజన్ సర్వీస్ సెంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాయని కమిషనర్ తెలిపారు.

లాభం పంచుతానంటూ బోర్డు తిప్పేశాడు..

పెట్టుబడులు పెట్టిన వారిని భారీగా మోసం చేసిన డెయిరీ వ్యాపారి
రాత్రికి రాత్రే గేదెలను తరలించి డెయిరీ ఫాం మూసివేత
సుమారుగా 15 కోట్ల వరకు మోసం
న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన బాధితులు

మొయినాబాద్, మార్చి27:డెయిరీ ఫాంలో భారీగా లాభాలు వస్తాయని ప్రకటనలు వేశాడు...ప్రకటనలు చూసిన వారు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చారు.....పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారిని బాగా నమ్మించాడు.....పెట్టుబడులు పెట్టించి ఆరు ఏండ్ల తరువాత డెయిరీ ఫాంను మూసివేసి పెట్టుబడులు పెట్టిన వారిని నట్టేట ముంచి డెయిరీ వ్యాపారి పరార్ అయ్యాడు. ఈ భారీ మోసం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోనికి వెళ్లగా ప్రస్తుతం కోకాపేటలో నివాసం ఉంటున్న వేముల సుబ్బారావు, అతని భార్య వేముల కుమారి డెయిరీఫాంను ఆరు ఏండ్ల క్రితం నాగిరెడ్డిగూడ గ్రామంలో ఏర్పాటు చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన కీసరి సంజీవరెడ్డి పొలం అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలో ఉంటుంది.కాగా డెయిరీ ఏర్పాటుతో పాటు వ్యవసాయం చేయడానికి కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి 2019లోనే సంజీవరెడ్డి వద్ద లీజుకు తీసుకున్నాడు.అయితే శ్రీనివాస్ రావు,హైదరాబాద్ నగరంలో పక్కాలోకల్ పేరుతో రెస్టారెంట్లు నడుపుతున్న కోటేశ్వర్‌రావు ఇద్దరు స్నేహితులు.డెయిరీ వ్యాపారి వేముల సుబ్బారావు అనే వ్యక్తి నగరంలో కోటేశ్వర్‌రావు రెస్టారెంట్‌లకు డెయిరీ ప్రొడక్ట్‌లు సరఫరా చేస్తుంటాడు.ఈ క్రమంలో పెద్దగా డెయిరీ ఫాం పెట్టాలని ఉందని,తమకు పొలం కావాలని కోటేశ్వర్‌రావును అడగగా అజీజ్‌నగర్‌లో నా స్నేహితుడు లీజుకు తీసుకున్న పొలం ఉందని, దానిలో డెయిరీ పెట్టుకో అని చెప్పాడు. దీంతో వేముల సుబ్బారావు,అతని భార్య ఇద్దరు కలిసి అజీజ్‌నగర్‌లో శ్రీనివాస్‌రావు లీజుకు తీసుకున్న పొలంలో డెయిరీని ఏర్పాటు చేశారు.డెయిరీని మరింత పెద్ద ఎత్తున పెట్టాలని భావించి రెండేండ్ల క్రితం పెట్టుబడులను ఆకర్షించడానికి కొండపల్లి డెయిరీ పేరుతో ప్రకటనలు ఇచ్చాడు. పెట్టుబడులు పెడితే భారీగా ఖచ్చితమైన లాభాలు వస్తాయని ప్రకటనలో పేర్కొనడంతో కొందరు ఆశపడి ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టారు. మొత్తానికి 6 సంవత్సరాల పాటు డెయిరీని నిర్వహించాడు. సుమారుగా పది మంది వరకు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. అందరి నుంచి దాదాపుగా రూ.15 కోట్ల వరకు పెట్టుబడులు రాబట్టుకున్నాడు.అందులో సాయి హరీశ్ అనే వ్యక్తి ఒక్కడే సుమారుగా రూ.3 కోట్ల వరకు పెట్టుబడి పెట్టాడు.పెట్టుబడులు పెట్టిన వారికి కొందరికి డెయిరీలో వచ్చిన లాభాలు కూడా ఇచ్చాడు.అత్యాశకు పోయిన వేముల సుబ్బారావు పెట్టుబడులు పెట్టిన వారిని మోసం చేయాలని ఆలోచించి ఉన్నట్టుండి గత 9 రోజుల క్రితం డెయిరీని పూర్తిగా ఎత్తివేశాడు.పెట్టుబడులు పెట్టిన వారు వారం రోజుల నుంచి ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో వారికి అనుమానం రావడంతో డెయిరీ వద్దకు వచ్చి చూసే సరికి డెయిరీ మూతపడి ఉండటంతో పెట్టుబడులు పెట్టిన వారు తీవ్ర ఆందోళనకు గురై వారం రోజుల క్రితం మొయినాబాద్ పోలీసులను ఆశ్రయించారు.అధికంగా పెట్టుబడులు పెట్టి మోసపోయిన సాయి హరీష్ అనే వ్యక్తి ముందుగా ఫిర్యాదు చేశాడు.అనంతరం మరో ఎనిమిది మంది బాధితులు వేరుగా ఫిర్యాదు ఇచ్చారు.పెట్టుబడులు పెట్టిన వారిని మోసం చేసిన డెయిరీ వ్యాపారి వేముల సుబ్బారావు,అతని భార్య వేముల కుమారిపై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.పెద్ద మొత్తంలో ఆర్థిక నేరం జరిగిందని ఈ కేసును సైబరాబాద్ కమిషనరేట్‌లోని ఆర్థిక నేరాల విభాగంకు బదిలీ చేశామని మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మానవ అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేయాలి

శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీలత

ఆదిబట్ల,మార్చి 27ః మానవ అక్రమ రవాణాకు ప్రతి ఒక్కరం అడ్డు కట్ట వేయాలని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు.గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ని సమావేశ మందిరంలో ఐకేపీ ఎపీఎంయస్,సీసీ లకు మానవ అక్రమ రవాణా పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా ఎన్ని విధాలుగా జరుగుతుందనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా పేదరికంలో ఉన్న వలస వచ్చిన కుటుంబాలు ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న యువతను ఆకర్షించి వారిని నమ్మించి మోసం చేస్తారని అన్నారు.నగరాల్లో ఉద్యోగం చేయిస్తూ ఎక్కువ సంపాదన చేయవచ్చనే మాయ మాటలు చెప్పి మ్మివేయడం జరుగుతందని అన్నారు.ఈ విధంగా 130 దేశాలలో అక్రమ రవాణా జరుతుందని ప్రతి నిమిషానికి ఓక్కరు అక్రమ రవాణాకు గురి అవుతున్నారని అన్నారు.

ఏప్రిల్ 25 నుంచి పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీలలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలను వచ్చే నెల 25వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండు రంగారెడ్డి తెలిపారు. రోజు మూడు సెషన్లలో 49 విభాగాల పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను వచ్చే నెల 20వ తేదీ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో హైదరాబాద్ లో మాత్రమే నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రానికి 90 నిమిషాల ముందుగా చేరుకోవాలని సూచించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలకు wwwouadmissions.com, www.osmania.ac.in లో చూసుకోవచ్చని చెప్పారు.

సైబర్‌మోసంతో కోల్పోయిన సొమ్ము.. తిరిగి అప్పగింత

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ): సైబర్ క్రైమ్ హైదరాబాద్ పోలీసులు ఓ వ్యక్తి తాను సైబర్ మోసానికి గురై కోల్పోయిన సొమ్మును రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి సైబర్ నేరగాళ్లు చెప్పిన మాయమాటలు నమ్మి తన బిజినెస్ కోసం రూ.9,50,531లను వివిధ అకౌంట్లకు పంపాడు. తర్వాత వారు మోసం చేశారని తెలుసుకుని సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. న్యూఢిల్లీకి చెందిన నేరస్తుడిని పట్టుకుని వారి నుంచి మొత్తం సొమ్మును రికవరీ చేశామని, ఆ సొమ్మును గురువారం సదరు బాధితుడికి చెక్కు రూపంలో అందజేసినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ఎస్ఐ అభిషేక్, హెడ్‌కానిస్టేబుల్ సతీశ్, పీసీలు శ్రీనివాసరెడ్డి, క్రాంతికుమార్‌రెడ్డిలను సైబర్ క్రైమ్ ఉన్నతాధికారులు అభినందించారు.

తుపాకీతో ఓపెన్ టాప్ జీపులో హల్‌చల్

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, మార్చి 27: అర్ధరాత్రి వేళ ఓపెన్ టాప్ జీపులో ప్రయాణిస్తూ చేతిలో తుపాకీతో హల్‌చల్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారా హిల్స్ రోడ్ నంబర్ -1 లోని సర్వీ హోటల్ సమీపంలో కొంతమంది యువకులు ఓపెన్ టాప్ జీప్ లో అతివేగంగా ప్రయాణిస్తూ గట్టిగా కేకలు వేస్తుండటంతోపాటు రోడ్డు పై వెళ్లే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ వీడియో ఇన్‌స్టాగ్రామ్ లో వైరల్ అయింది. ఆ వీడియోలో యువకుల్లో ఒకరు తన చేతిలో తుపాకీ గాల్లోకి చూపిస్తూ హల్‌చల్ చేశారు. దీంతో ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తించిన బంజారాహిల్స్ పోలీసులు సుమోటో గా ఆకతాయిలపై బీఎన్ ఎస్ 125, 292,351(2) తో పాటు ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగికి సైబర్ క్రిమినల్ రూ.70వేలు టోకరా

సోదరిలా ఇన్ స్టాగ్రామ్ లో టికీకి మెసేజ్‌పంపిన కేటుగాడు

వెంగళరావునగర్, మార్చి 27: ఆపదలో ఉన్న సోదరిలా ఇన్ స్టా గ్రామ్ లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కు ఓ మెసేజ్‌పంపి రూ.70 వేలు కాజేశాడు సైబర్ కేటుగాడు. ఎస్ఆర్.నగర్ పోలీసుల కథనం ప్రకారం.. అమీర్ పేట్ ధరమ్ కరమ్ రోడ్డులో నివాసం ఉంటున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగి శ్రీధర్ వారణాసి(45)కి ఈనెల 25వ తేదీన వరుసకు సోదరైన లావణ్య పేరు మీద ఇన్‌స్టాగ్రామ్ లో ఓ మెసేజ్‌వచ్చింది. సోదరి అని భావించిన శ్రీధర్ చాటింగ్‌చేశాడు. తనకు డబ్బు అత్యవసరంగా ఉందని వచ్చిన మెసేజ్ ను చూసి సోదరికి సాయపడాలని భావించాడు. అకౌంట్ కు రూ.30 వేలు పంపగా..అవి రాలేదని చెప్పడంతో మరోసారి మళ్లీ రూ.30 వేలు పంపాడు. అలా శ్రీధర్ తన అకౌంట్ నుంచి మొత్తం రూ.70 వేలు పంపాడు. అనుమానం కలుగడంతో సైబర్ నేరగాళ్ల పనేనని గుర్తించాడు. బాధితుడు శ్రీధర్ ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సంఘాలు బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లోసెర్ప్ సీఈవో దివ్య, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు

వికారాబాద్, మార్చి 27 : ధాన్యం కొనుగోలు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్, పెట్రోల్ బంకుల నిర్వహణ తదితర కార్యక్రమాల వల్ల స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్ నుండి సెర్ప్ సీఈఓ దివ్య తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఆర్డీఓ,సెర్ప్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ ద్వారా రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరింత పెంచాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా ఐకేపీ మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన పెండింగ్ లో ఉన్న కమిషన్ ను సమీక్షించాలని సూచించారు. గన్ని బ్యాగుల సమీకరణ చేయాలని , భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో మహిళ సంఘాల ద్వారా గోడౌన్లతో పాటు, రైస్ మిల్లుల ఏర్పాటు వంటివి ఆలోచిస్తున్నందున ధాన్యం కొనుగోలులో స్వయం సహాయక మహిళా సంఘాలు చురుకుగా పాల్గొనేలా చూడాలన్నారు. ఒక కుటుంబంలో ఒకరికే వృద్ధాప్య పింఛన్ ఉండేలా చూడడం, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు తొలగించడం వంటివి ఎంపీడీవోల ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలు ద్వారా పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్‌తో పాటు,వారి ఆదాయ మార్గాలు పెంచుకునే విధంగా ప్రైవేట్ ఆర్డర్లపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా ప్రతి జిల్లా , నియోజక వర్గ, మండల కేంద్రాలలో పెట్రోల్ బంక్‌లను నిర్వహించాలని ఆలోచిస్తున్నందున జిల్లా స్థాయిలో పెట్రోల్ బంక్ ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించినట్టే, మండల, నియోజకవర్గాల స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. సెర్ప్ సీఈవో దివ్య వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 128 సెంటర్లలో ఐకేపీ కేంద్రాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుత యాసంగి సీజన్ 34 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గన్ని బ్యాగులు సరిపడ అందుబాటులో ఉన్నాయని అన్నారు. దివ్యాంగులను నిర్ధారించేందుకు అవసరమైన పరికరాలు ఆసుపత్రిలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్ ,సుదీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, సరోజ, మోహన్ బాబు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం

ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ): డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం చేసి డబ్బులు దోచుకున్న ముగ్గురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు చెప్పిన ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన వీరబోయిన సాయిరాజ్ గత సంవత్సరం నవంబర్ 28వ తేదీన తనకు ఓ సెల్ నుంచి నుంచి కాల్ వచ్చిందని, సైబర్ నేరస్తుడు తాను ముంబై బాంద్రాలోని కుర్లా పీఎస్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ సంజయ్‌పాటిల్‌గా పరిచయం చేసుకున్నాడని తెలిపారు. ఆ తర్వాత కోర్టులో సాయిరాజ్‌పై ఓ కేసు నమోదైందని, అతడి అకౌంట్‌నుంచి రూ.25లక్షల మనీలాండరింగ్ జరిగినట్లు బెదిరించాడు. ఆ తర్వాత స్కైప్ కాల్‌కు రమ్మని చెప్పి ఆ మొత్తం అమౌంట్‌ను తన అకౌంట్‌కు వెరిఫికేషన్ కోసం ట్రాన్స్‌ఫర్ చేయమని అడిగితే తాను అలా చేయలేదని, తన దగ్గర అంత డబ్బులు లేవనడంతో తామే లోన్ ఇస్తామంటూ ముందుగా కొన్ని డబ్బులు పంపమని చెప్పి రూ.3,57,998 రెండు దఫాలుగా వారి అకౌంట్‌కు పంపించాడని, దీనికి అతడికి పోలీస్ క్లియరెన్స్ కూడా ఇస్తామని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. తర్వాత తాను మోసపోయినట్లు గ్రహించడంతో సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించారని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులు గుంటూరుకు చెందిన తోట శ్రీనివాసరావు, లామ్ జీవన్‌కుమార్, తమ్మిశెట్టి రఘువీర్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అయితే నిందితుల్లో తోట శ్రీనివాసరావు, లామ్‌జీవన్‌కుమార్ ఇద్దరూ ఫిజియో థెరపిస్ట్‌లుగా పోలీసులు పేర్కొన్నారు. ఈ ముగ్గురిపై దేశవ్యాప్తంగా 14 కేసులున్నాయని, తెలంగాణలో ఒక కేసు నమోదైందని పోలీసులు తెలిపారు.

పని చేస్తున్న సంస్థకే టోకరా.. ఇద్దరిపై కేసు

బంజారాహిల్స్, మార్చి 27: పనిచేస్తున్న సంస్థ లావాదేవీలలో అవకతవకలకు పాల్పడిన ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10(సి)లోని గాయత్రీ హిల్స్ లో పారిజాత హోమ్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థ ఆఫీస్ ఉన్నది. గత కొంతకాలంగా సంస్థలో ఆర్. గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి అకౌంటెంట్ గా, చంద్రకాంత్ అన